# "నీవు నేర్పిన విద్యయే"

శృంగార వీధి

స్వాతి

సీత బెడ్రూమ్‌లో అసహనంగా అటూ ఇటూ తిరుగుతూంది. ఓ వైపు ఉక్రోషం, మరో వైపు దుఃఖం పోటీ పడుతూ సీత కళ్ల నిండా నీరు నింపుతున్నాయి. ఎంత ఆపుకుందామన్నా ఆగని కన్నీటి చుక్క ఒకటి ఆమె బుగ్గలమీద నుంచి వెచ్చగా జారిపోయింది.

ఎంత ప్రయత్నించినా నిద్ర రావటం లేదు.

మనసు పరిపరివిధాల పోతోంది. తన భర్త ప్రసాద్ అన్ని విధాలా మంచివాడనే చెప్పాలి. రోజూ తాగొచ్చి పెళ్లాన్ని చితగ్గొట్టే భర్తలకన్నా, డబ్బుకోసం కక్కుర్తిపడి భార్యల్ని హింసించే భర్తలకన్నా, కొంగు కనబడగానే చొంగలు కార్చుకుంటూ పరుగెత్తే భర్తలకన్నా.. ఇలా అందరికన్నా మంచివాడనే చెప్పాలి.

కానీ వచ్చిన ఇబ్బందల్లా ఒక్క చోటే. తను 'దూరం' వున్న మూడు రోజులూ ఆయన ఫ్రెండ్ ప్లస్ మా ఫ్యామిలీ ఫ్రెండ్ అయిన గాయత్రి దగ్గరికి వెళ్లి గంటలు గంటలు గడిపేస్తాడు. పోనీలే గడిపితే గడిపాడు అనుకుంటే, ఈ మధ్య 'ఆ టైమ్'లో కూడా ఆవిడగారి నామస్మరణతోనే గడిపేస్తున్నారు. గాయత్రి పెద్ద అందగత్తేం కాదు. కానీ ఈయన గారికి నచ్చే విధంగా బొడ్డు కిందకి చీర కడుతుంది. నడుంమీద ముడత కనిపిస్తూ వుంటుంది.

అసలే ఆడవాళ్ల సౌందర్యాన్ని ఆరాధించే రసపిపాసి. దారిన పోయే ఆడాళ్లని చూపించి, "చూడు సీతా! ఆ ఆంటీ ఎంత అందంగా వుందో, ఆవిడ బ్లౌజ్ చూడు-నెక్ కిందకి సన్నని గీత కనిపించేలా వేసుకుంది. అన్నిటినీ మించి నడుం మీద పడిన ముడత చూస్తుంటే ఎవరికైనా పిచ్చెక్కుతుంది" అంటూ



అంగాంగవర్ణన చేస్తాడు. మంచి అంగసౌష్ఠవం వున్న ఆడాళ్లుగానీ, నడుంమీద ముడతలు కనిపించి వంపులు తిరిగిన శరీరం గలవాళ్లు కానీ కనిపిస్తే మాత్రం రెప్ప వాల్చకుండా చూస్తాడు. మొదట్లో తను పెద్దగా పట్టించుకోలేదు. అందాన్ని చూడటం ఎవరికైనా ఆనందమే కదా అని తనూ నవ్వేసి ఊ కొట్టి ఊరుకునేది. కానీ రానురాను ఆడవాళ్లను చూసినప్పుడల్లా 'ఆ భాగాల్ని' వర్ణించటంతో తను భరించలేని స్థితికి వచ్చింది. కనీసం తను ఫీలవుతుందేమోనని కూడా లేకుండా కళ్లప్పగించి వాళ్లను చూస్తుండి పోతాడు.

"మరీ అంత తినేసేలా చూస్తారేంటండీ?" అనంటే, "ఏంటీ? నన్నే అనుమానిస్తున్నావా? నిన్ను అనుమానపిశాచం పట్టుకున్నట్టుంది! ఒకరి మీద ఒకరికి నమ్మకం లేకపోతే ఆ సంసారాలు సజావుగా సాగవు" అంటూ ఉపన్యాసం ఇస్తాడు. "నేను అందాన్ని ఆరాధిస్తానే కానీ అనుభవించాలనుకోను కదా! అలాంటప్పుడు నన్ను అనుమానిచడమెందుకు?" అంటాడు.

ఇక నేను ఏం మాట్లాడాలో అర్థం కాదు. నిజమే కదా అని ఎడ్జస్ట్ అయిపోతూంది. కానీ గాయత్రి విషయంలో మాత్రం తన్నుతాను సమాధానపరచుకోలేక పోతూంది. ఎంతసేపూ గాయత్రి జపమే సరిపోతూంది. చివరికి 'ఆ టైమ్' లో ఫాంటసీ ఊహిస్తూ "గాయత్రి అయితే ఇలా చేస్తుంది, అలా అంటుంది" అంటూ 'పని' పూర్తి చేస్తున్నాడు. అది మాత్రం భరించలేకపోతూంది తను. కొన్నాళ్లు భరించింది. ఇక భరించలేక "అలాంటి ఫాంటసీలు వద్దండి. నాకిష్టం వుండదు" అని చెప్పి చూసింది.

"ఉహూ! లాభంలేదు. అప్పుడప్పుడు అలా చెప్పుకుంటేనే థ్రిల్ వుంటుందోయ్!" అంటూ మరింత ఉత్సాహంగా చెప్పడం మొదలెట్టాడు. "మొన్న వాళ్లింటికెళ్లినప్పుడు నన్నిలా రెచ్చగొట్టింది. చీర ఇలా కట్టుకుంది. అసలే మొదట్నుంచీ నా మీద మోజుగా వుండేదేమో, ఇప్పుడు మరీ ఎక్కువైంది. 'పెళ్లికి ముందే నీతో ఒక్కసారన్నా 'సుఖ'పడాలనుకున్నాను. అప్పుడు 'నో!' అన్నావు. కనీసం ఇప్పటికైనా కరుణించావు' అంటూ ఏవేవో చేసింది" అంటూ ఏవేవో చెప్పడంతో చివరికి తనలో నిజమేనేమో అన్న అనుమానం రేకెత్తుతోంది. అదంతా నిజం కాదన్న నమ్మకం తనకుంది. కానీ ప్రతిసారీ అలా చెప్తుంటే నిజమేనేమోనన్న అనుమానం పెరిగిపోతోంది. అతను అలా అంటున్నా, ఏం చేస్తున్నా తనేమీ చెయ్యలేకపోతున్నదనే కసి, ఉక్రోషం పెరిగిపోతున్నాయి. అంతెందుకు? ఈ రోజు తను 'దూరం' అని తెలిసి 'పనుంది' అని బయటికెళ్లిపోయాడు. కనీసం వెళ్లేటప్పుడు చెప్పనుకూడా లేదు. లుంగీతో బయటికి వెళ్లటం ఏ మాత్రం ఇష్టం లేని వ్యక్తి, లుంగీ కట్టుకుని కనీసం అండర్ వేర్ అన్నా లేకుండా వెళ్లిపోయాడంటే... ఛ! ఛ! అనుకుంటూ ఆలోచనల్నుంచి బయటపడి 'ఏమిటో మరీ ' అన్యాయంగా ఆలోచిస్తున్నానేమో!' అనుకుంటూ 'ఏలాగైనా ఈయన్ని ఈ బలహీనత నుంచి తప్పించాలి. అప్పుడుకానీ తనకు మనశ్శాంతి వుండదు' అనుకొని నిద్రకు ఉపక్రమించింది.

✢ ✢ ✢

ఒక రోజు మార్కెట్‌కి వెళ్లి ఇంటికొచ్చేసరికి హాల్లో నలుగురైదుగురు కూర్చుని వుండటం చూసింది. 'ఎవరా?' అనుకుంటూ లోపలికి అడుగు పెట్టేసరికి తన చిన్ననాటి స్నేహితులు రఘు, రమ, లావణ్య, వాళ్ల తల్లిదండ్రులు. సీతావాళ్ల కుటుంబానికీ, వీళ్ల కుటుంబానికీ మంచి స్నేహం వుండేది. పెద్దయ్యాక రఘు సీతకోసం, సీతతో పెళ్లికోసం చాలా ప్రయత్నాలు చేశాడు. కానీ సీత అలాంటివేవీ సాగనివ్వలేదు. మంచి స్నేహితుల్లాగే వుందామని కచ్చితంగా చెప్పింది. దాంతో అతను కూడా ఏం మాట్లాడలేదు. ఆ తర్వాత సీత తండ్రికి ట్రాన్స్‌ఫరై వేరే వూరు వచ్చెయ్యటం, అక్కడే ప్రసాద్‌తో పెళ్లి జరగడం అన్నీ గబగబా జరిగిపోయాయి. ఆ తర్వాత మళ్లీ ఇదే వాళ్లను చూడటం.

కుశలప్రశ్నలయ్యాక వాళ్లు ఇక్కడే తమ-వీధి చివర్న అద్దెకు దిగుతున్నారని తెలిసింది. రెండు రోజుల్లో రెండు రోజుల్లో వాళ్లు రావటం, తన భర్తకు పరిచయం చేయటం కూడా అయ్యాయి. సీత మనసులో ఓ పథకం రూపు దిద్దుకుంది. దానిలో భాగంగానే-భర్తతో మాట్లాడినప్పుడల్లా రఘునూ, అతని పర్సనాలిటీనీ అరమోడ్పు కళ్లతో వర్ణించటం, తనకు దగ్గర కావటానికి రఘు చేసిన ప్రయత్నాలు కథలు కథలుగా చెప్పటం మొదలు పెట్టింది.

సీత మాటల్ని మొదట్లో పెద్దగా పట్టించుకోని ప్రసాద్, రానురాను వినటం ఇష్టం లేనట్లు మొహం చిట్లించేవాడు. సీత ఆ విషయం గమనించనట్లు అతని విషయాలే చెప్పేది. చివరికి 'ఆ టైమ్'లో కూడా అతని నామస్మరణే మొదలుపెట్టింది. ఇక భార్య ప్రవర్తనను తట్టుకోలేని ప్రసాద్, "ఎంతసేపూ అతని గురించేనా? వేరే ఏదైనా మాట్లాడు!" అనేవాడు. వేడిగా వున్నప్పుడే దెబ్బలు బాగా పడితే ఇనుము వంగుతుందని గ్రహించిన సీత, అక్షరాలా ఆ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టింది.

ఇక ప్రసాద్ భరించలేని స్థితికి వచ్చేశాడు. కానీ గట్టిగా ఆ విషయం భార్యకు చెప్పలేడు. ఎందుకంటే ఒకప్పుడు తనే ఫాంటసీ పేరుతో సెక్స్ విషయంలో సైతం గాయత్రిని వర్ణిస్తూ 'పని ' కానిచ్చేవాడు. కానీ బండి యిప్పుడు రివర్సయింది. వేరే వ్యక్తిని ఊహించుకోవటం, భర్తకు వర్ణించి చెప్పటం, సరదాగానైనా పదేపదే తను గాయత్రి వాళ్లింటికి వెళ్లి ఆలస్యంగా ఇంటికి రావటం, ఎంత బాధాకరంగా వుంటాయో, ఎంత నరకప్రాయమో అనుభవపూర్వకంగా తెలిసివచ్చింది. ఇంకెప్పుడూ యిలాంటి పనులు చెయ్యడుగాక చెయ్యడు! ఇప్పుడు తను ఇవన్నీ మానేశాడు. సీత కూడా మానేస్తే బాగుండును అని వుంది. కానీ సీత మాత్రం వదిలేలా లేదు.

అందుకనే ప్రసాద్ ఓ నిర్ణయానికి వచ్చి ఆ రాత్రి భార్యతో ఇలా అన్నాడు-"సీతా! మనం ఇకనుంచి వేరే వ్యక్తుల్ని మన మధ్యకు తేవద్దు. ఆ ప్రసక్తే తెచ్చుకోవద్దు. నాకు బాగోలేదు!" అని.

"అదేంటండీ, అలా అంటారు?" సీత ఆశ్చర్యంగా అడిగింది. "ఇదంతా మీరు నేర్పిన విద్యే కదా! ఇన్నేళ్లకి ఎంజాయ్ చేయటం అంటే ఏమిటో తెలిసింది. నాకీ లైఫ్ ఎంత థ్రిల్లింగ్‌గా వుందో తెలుసా? ఏమైనా మీరు ఎన్నయినా చెప్పండి, గాయత్రితో మీకున్న థ్రిల్ ఏపాటిదో కానీ నాకు మాత్రం రఘుని తల్చుకుంటుంటే..." అంటూ ఇంకా ఏదో మాట్లాడబోతున్న సీత పెదాల్ని తన పెదాలతో మూసేశాడు ప్రసాద్. ఆ ముద్దు వారిద్దరి మధ్యా ఏర్పడ్డ అపార్థాన్ని తొలగించి కొత్తజీవితానికి నాంది పలికింది. ■

